సాక్షి ప్రకాశం

సోమవారం । 7 । ఆగస్టు । 2023



ఆయుర్వేదానికి వ్యవ'సాయం'

గిద్దలూరు మండలం దిగువమెట్ట తండా ప్రాంతంలో ఆయుర్వేద మొక్కలు సాగవుతున్నాయి. పాషాణభేది మొక్కలు సాగుచేస్తున్నారు.

- 8లో..



విద్యుదాఘాతానికి ముగ్గురు బలి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతానికి ముగ్గురు బలయ్యారు. కనిగిరి, పీసీపల్లి, పొదిలి మండలాల్లో ఈ ఘటనలు జరిగాయి.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 37/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ప్రజా గాయకుడు గద్దర్‌కు మంత్రి సురేష్ నివాళి

యర్రగొండపాలెం: ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు గద్దర్ అండగా నిలిచారని, తన గేయాలతో ప్రజలను చైతన్య పరచి ఆలోచింప చేసిన ప్రజాగాయకుడని ఆయన కొనియాడారు. గద్దర్ మృతి తెలుగు రాష్ట్రాల్లోని బడుగు, బలహీన, పేద వర్గాలకు తీరని లోటని తెలిపారు.

జూటూరి, లంకాకు జ్యోతిష ప్రజ్ఞ పురస్కారాలు



డాక్టర్ ప్రసన్న కుమార్‌ను జ్యోతిష ప్రజ్ఞ పురస్కారంతో సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ఒంగోలు మెట్రో: అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో జ్యోతిష ప్రజ్ఞ పురస్కారాలను జిల్లాకు చెందిన ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ జూటూరి భానుమూర్తి సిద్ధాంతి, డాక్టర్ లంకా ప్రసన్నకుమార్ శర్మకు అందజేశారు. గురు పురస్కారాల కార్యక్రమాన్ని ఆదివారం ఏలూరులోని ఆర్‌ఆర్‌పేట వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించారు. అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.

అబద్ధాల బాబు మాయమాటలు..

- అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రాజెక్టుల గురించి పట్టించుకోని చంద్రబాబు
- సాగుకు నీళ్లు లేక బీడువారిన పొలాలు
- నాడు చేయనివి.. రేపు అధికారంలోకి వస్తే చేస్తానంటూ ప్రగల్భాలు
- బాబు మాయమాటలపై జిల్లా వాసులు విస్మయం

అధికారంలో ఉన్న ఐదేళ్లు జిల్లాను గాలికొదిలేశాడు. గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులకు శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకున్నాడు. అధికారంలోకి మళ్లీ వస్తే ప్రాజెక్టులను పరిగెత్తిస్తాను, నీళ్లు పారిస్తాను, నదులను అనుసంధానం చేస్తానంటూ చంద్రబాబునాయుడు 24వ పులకేసి మాటలు చెప్తున్నాడంటూ జిల్లాలోని రైతులు, స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



చీమకుర్తి:

ప్రాజెక్టుల పరిశీలనంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న యుద్ధభేరిలో ఆదివారం మద్దిపాడు మండలం గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. రైతుల ముసుగులోనున్న తెలుగు తమ్ముళ్లతో ప్రాజెక్టుల పనితీరుపై యూనివర్సిటీలో ప్రొఫెసర్ మాదిరిగా డిజిటల్ క్లాసులు ఇచ్చారు. మీరు మళ్లీ నాకు అధికారం ఇస్తే నేను మళ్లీ ముఖ్యమంత్రినైతే నదులు అనుసంధానం చేస్తానని, ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ, వెలిగొండ ప్రాజెక్టులకు వైభవం తెస్తానని లేనిపోని ఆశలను కల్పించే ప్రయత్నం చేశాడు. 1999–2004 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులకు శిలాఫలకాలు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప ప్రాజెక్టులను నిర్మించింది లేదు. ఒక్క రూపాయి విడుదల చేసింది లేదు. ఒక పక్క బాంబు దాడులను తట్టుకొని బయటకు వచ్చిన ఉక్కు మనిషినని చెప్పుకునే చంద్రబాబు.. గతంలో రామతీర్థంలో చుట్టుపక్కల కొండలుండటంతో నక్సలైట్ల ప్రభావం ఉంటుందనే అనుమానాలతో శిలాఫలకాన్ని వేసేందుకు కూడా రామతీర్థం రాలేక గుండ్లకమ్మలోనే రామతీర్థం శిలాఫలకాన్ని వేసి పారిపోయిన విషయాలను మర్చిపోయాడు.

వైఎస్ హయాంలోనే పూర్తయిన గుండ్లకమ్మ, రామతీర్థం:

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2004లో అధికారంలోకి వచ్చి గుండ్లకమ్మకు రూ.600 కోట్లు, రామతీర్థం రిజర్వాయర్‌కు రూ.55 కోట్లు విడుదల చేసి ప్రాజెక్ట్‌లను నిర్మించటమే కాకుండా పూర్తి చేశారు. 2008లో గుండ్లకమ్మ ప్రాజెక్టు, 2009లో రామతీర్థం ప్రాజెక్టులను ప్రారంభించారు. గుండ్లకమ్మ ద్వారా 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, తాగునీటి సదుపాయం, రామతీర్థం ద్వారా 72 వేల ఎకరాల ఆయకట్టు, చీమకుర్తి, ఒంగోలు, సంతనూతలపాడు, కందుకూరు, తాళ్లూరు, సీఎస్ పురం మండలాల ప్రజలకు తాగునీటిని ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర రెడ్డికే దక్కుతుందని జిల్లావాసులంతా ముక్తకంఠంతో చెబుతారు.

బాబు హయాంలో అలవిమాలిన నిర్లక్ష్యం:

2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు 2019 వరకు గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టులకు చేసిందేమీ లేకపోగా వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన పాప ఫలితమే గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు కొట్టుకుపోవడానికి కారణమైన సంగతి అందరికీ తెలిసిందే. గుండ్లకమ్మ ప్రాజెక్టుల మెయింటినెన్స్‌కు ఇచ్చిన రూ.5 కోట్లను సుందరీకరణ పేరుతో టీడీపీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా మెక్కేశారు.

దీంతో గుండ్లకమ్మ గేట్లు పూర్తిగా తుప్పుపట్టి ఇప్పుడు వరద తాకిడికి కొట్టుకుపోతే ఆ నెపం వైఎస్సార్‌సీపీ పైన చంద్రబాబు వేయటం ఏంటని స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రామతీర్థం రిజర్వాయర్‌కు ఒక్క రూపాయి కూడా చంద్రబాబు ఇవ్వలేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత జిల్లాకు సాగునీరు తెప్పించే సాహసం చేయలేక చంద్రబాబు ప్రకాశం జిల్లాను గాలికొదిలేసిన పాప ఫలితంగా రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టుల కింద ఉన్న పొలాలన్నీ బీడు భూములుగా మారాయి. నీళ్ల కోసం రోడ్లు ఎక్కిన సంగతి, ఇరిగేషన్ కార్యాలయానికి తాళాలు వేసిన సంగతి తామింకా మర్చిపోలేదనే సంగతి చంద్రబాబుకు గుర్తుందో లేదో అని రైతులు ఎద్దేవా చేస్తున్నారు.

రూ.2 కోట్లతో గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులకు రూ.2 కోట్ల వరకు నిధులు విడుదల చేశారు. ఆ నిధులతో ఇప్పటికే మూడు గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయి. ఖరీఫ్ సీజన్ నాటికి గుండ్లకమ్మ ఆయకట్టు రైతులకు సాగునీరు ఇచ్చేందుకు చురుకుగా పనులు జరుగుతుంటే అవేమీ తెలియదన్నట్లుగా చంద్రబాబు గుండ్లకమ్మ ప్రాజెక్ట్ వద్ద రైతుల పేరుతో ఉన్న తెలుగు తమ్ముళ్లతో మాట్లాడటం విడ్డూరంగా ఉందని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఏడాదికి 60 నుంచి 65 క్యూసెక్కుల నీటిని రామతీర్థం రిజర్వాయర్ ద్వారా జిల్లా వాసులకు క్రమం తప్పకుండా నాలుగేళ్ల నుంచి అందిస్తున్నారు. జిల్లావాసులకు తాగునీటి కోసం నాగార్జున సాగర్ డ్యాం నుంచి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సాగర్ నీళ్లను తెప్పించి గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్‌లను నింపిన సంగతి చంద్రబాబుకు తెలియకపోయినా, జిల్లా రైతులకు తెలుసునని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఇవన్నీ మర్చిపోయిన చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రాజెక్టులను పరిగెత్తిస్తాను, నీళ్లు ఏరులై పారిస్తానంటూ చెబుతున్న పులకేసి మాటలు మరోసారి జిల్లావాసులను మోసగించడమేనని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

చంద్రబాబు సభకు స్పందన కరువు



మల్లవరం డ్యాం వద్ద సభలో చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తుండగా వెనుతిరిగి వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు

- సభ ఏర్పాటు కోసం అత్యుత్సాహంతో చెట్లు నరికిన తెలుగు తమ్ముళ్లు

మద్దిపాడు: మండలంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టుల విధ్వంసం, జయభేరి సభకు వచ్చిన చంద్రబాబుకు ప్రజల స్పందన కరువైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసినా బస్సులకు పది మందికి మించి లేకపోవడం గమనార్హం. సభకు వచ్చిన చంద్రబాబు ప్రజలు తక్కువ మంది కనిపించడంతో తన ప్రసంగం కొద్ది సేపు ఆపారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్‌తో మాట్లాడించారు. గతంలో రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్ ప్రాంతంలో సభ నిర్వహించారు. ఆ చిన్నపాటి స్థలంలో రెండు వేలకు మించి పట్టే అవకాశం లేకపోవడం గమనార్హం.

సభ కోసం చెట్లు నరికిన తెలుగు తమ్ముళ్లు:

పాత హెలీప్యాడ్ వద్ద నాలుగేళ్ల క్రితం నీడ ఉంటుందని రిజర్వాయర్ అధికారులు చెట్లు నాటించారు. హెలీప్యాడ్ ప్రాంతంలో తెలుగు తమ్ముళ్లు సభ ఏర్పాటు చేసినా చంద్రబాబు తాను ప్రచార రథం పైనుంచే మాట్లాడతానని తెలుగు తమ్ముళ్లకు చెప్పినట్లు సమాచారం. దీంతో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహం ప్రదర్శించి మూడు వరుసలతో నాటిన చెట్ల మొత్తాన్ని కొట్టేశారు. సభ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు వచ్చిన వారికి మంచినీరు అందించడంలో విఫలమయ్యారు. రిజర్వాయర్ వద్ద ఉన్న ఒకటి రెండు షాపుల్లో తాగునీరు కొద్దిగా మాత్రమే ఉంది. వాటర్ బాటిళ్లు సైతం తక్కువగా ఉండడంతో ముందు త్వరపడిన వారికి బాటిల్స్ అందాయి. మిగిలిన వారు తాగడానికి నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద చంద్రబాబు సభ ఏర్పాటు కోసం నరికేసిన చెట్లు

సరళమైన బోధనపై దృష్టిసారించాలి

- అపుస్మా శిక్షణ తరగతుల్లో ఆర్జేడీ బి.విజయభాస్కర్



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్జేడీ బి.విజయభాస్కర్

ఒంగోలు: విద్యార్థులు శ్రద్ధగా వినాలంటే అందుకు ఆకట్టుకునేలా సరళమైన బోధనపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని విద్యాశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి విద్యాలయం ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) మారిన పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు శ్రద్ధగా వినడంలేదంటూ నెపం వేయడం సరికాదని, విద్యార్థులు పాఠ్యాంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థుల మనస్సుకు హత్తుకులానే బోధించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. పిల్లలు వినడంలేదని, బాగా చదవడంలేదని వారిపై మానసిక ఒత్తిడి పెంచడం కంటే వారు సరిగా వినేలా పాఠ్యాంశాలు బోధించడం తమ బాధ్యతగా భావించినప్పుడు అన్ని సమస్యలకు మార్గాలు లభిస్తాయన్నారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రతి ఏటా శిక్షణ తరగతులు నిర్వహిస్తూ అవగాహన కలిగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు అపుస్మా ముందుకు వచ్చిందని, శిక్షణ ఇచ్చేందుకు శ్రీకాళహస్తి నుంచి చిరంజీవి (సోషల్ స్టడీస్), కాకినాడ నుంచి డేవిడ్ (బయోలాజికల్ సైన్స్), రాజమండ్రి నుంచి దుర్గాబాబు(ఫిజిక్స్), విజయవాడ నుంచి సోమశేఖర్ (గణితం), నెల్లూరు నుంచి రత్నసాగర్ (ఆంగ్లం) రిసోర్సు పర్సన్లుగా రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రిసోర్సు పర్సన్లు ఉపాధ్యాయులకు సంబంధిత సబ్జక్టుల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అపుస్మా కార్యదర్శి బి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపీ సుబ్బారావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారులు వీరే



ఎంపికైన జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో తలపడే జిల్లా జట్టు ఎంపిక ఆదివారం స్థానిక గాంధీ పార్కులో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో అండర్ 20 (జూనియర్) జట్టు ఎంపిక ప్రక్రియను జిల్లా కార్యదర్శి జి.నవీన్‌తోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొని పర్యవేక్షించారు. ఎంపికైన జట్టు ఈనెల 12, 13 తేదీల్లో భీమవరం పట్టణంలోని జరిగే 9వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటుందని నవీన్ తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే:

బాలుర విభాగం: టి.జయంత్‌రెడ్డి-ఒంగోలు (ఫాయిల్ విభాగం), జి.మణితేజ్-ఒంగోలు, లోకేష్-ఒంగోలు, వై.వెంకట విశ్వనాథ్-చీమకుర్తి, అంరేష్-చీమకుర్తి (ఈపీ విభాగం), యస్.వంశీ ప్రదీప్ మాధవ్-చీరాల, పీవీఎస్ఎస్ వర్ధిష్ణు-ఒంగోలు, పి.చిన్న అయ్యవరెడ్డి-కర్లపాలెం, టి.అభినవ్‌బుద్ధ-టంగుటూరు (సైబర్ విభాగం)

బాలికల విభాగం: కె.తనూజ-లింగంగుంట, జి.చైత్ర-ఒంగోలు (ఫాయిల్ విభాగం), బి.నమ్రత-ఒంగోలు, కె.ప్రణీత-వర్సారు, హెచ్.శరణ్యసిరి-వర్సారు, ఎస్‌కె అసీఫాతబాసు-ఒంగోలు (ఈపీ విభాగం), కె.నాగజాహ్నవి-ఒంగోలు (సైబర్ విభాగం).

రైల్వేల ఆధునికీకరణ చారిత్రాత్మక నిర్ణయం

- ఒంగోలు పార్లమెంట్ పరిధిలో మూడు స్టేషన్లలో అభివృద్ధి పనులు
- ఒంగోలు రైల్వేస్టేషన్‌కు తూర్పువైపున ప్రత్యేకంగా బుకింగ్ కౌంటర్ మంజూరు
- అమృత్‌భారత్ రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ మాగుంట



ఒంగోలులో ఆధునికీకరణ పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్



దొనకొండలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, వేదికపై ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ఒంగోలు: ఒకేసారి దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు కేటాయించి 508 రైల్వేస్టేషన్లలో అభివృద్ధి, ఆధునికీకరణ పనులు ప్రారంభించడం చారిత్రాత్మకం అని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో అమృత్ భారత్ కింద 508 రైల్వేస్టేషన్ల అభివృద్ధి, ఆధునికీకరణ పనులు ప్రారంభించిన కార్యక్రమానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ రైల్వేల చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం తొలిసారి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరిక మేరకు ఒంగోలు పార్లమెంట్ పరిధిలో ఒంగోలు రూ.19.10 కోట్లు, సింగరాయకొండకు రూ.25.13 కోట్లు, దొనకొండకు రూ.18.3 కోట్లు కేటాయించారని చెప్పారు. స్థానిక అగ్రహారం రైల్వేగేటు, సింగరాయకొండ, పాకల, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి వందశాతం నిధులు రైల్వేశాఖ కేటాయించేందుకు ముందుకు రావడంపై ఆయన ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే శాఖామంత్రి, రైల్వేశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలు రైల్వేస్టేషన్‌కు తూర్పు వైపున మూడో ప్లాట్‌ఫాం నిర్మాణం వేగవంతమైందని, అది పూర్తి కాగానే తూర్పువైపున పెరిగిన పట్టణానికి తగ్గట్లుగా మూడో టికెట్ బుకింగ్ కౌంటర్ కూడా ప్రారంభించేందుకు రైల్వేశాఖ అనుమతులు మంజూరు చేసిందని చెప్పారు. తాజాగా మూడు ఎస్కలేటర్లు, ఒక లిఫ్టు సౌకర్యం రావడం వల్ల వృద్ధులు, సీనియర్ సిటిజన్లతోపాటు అన్ని వర్గాలకు ఆధునిక సేవలు అందుబాటులోకి వచ్చినట్లవుతుందన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలు రైల్వేస్టేషనకు ప్రతిరోజు 74 రైళ్లు ఆగడం, 25 వేల మంది ప్రయాణికులు రైలు ప్రయాణం చేస్తున్నారన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు రైలు మార్గాలు ప్రకాశం జిల్లా నుంచే వెళుతున్నందున వాటికి అవసరమైన స్థల సేకరణను యుద్ధ ప్రాతిపదికపై జిల్లా యంత్రాంగం చేపడుతుందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అగ్రహారం రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి, తూర్పువైపున రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటైతే తూర్పు వైపు కూడా ఒంగోలు మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వేశాఖ సీనియర్ డీసీఎం రమణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాతా ప్రసాద్, బెల్లం సత్యన్నారాయణ, ఓగిరాల రామకృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చినయోగయ్య యాదవ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రకాశంలో ఒక వెలుగు దొనకొండ

దొనకొండ: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా దొనకొండ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, మౌలిక వసతుల ఏర్పాటుకు ఎంపిక కావటం దొనకొండకు గొప్పవరమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రధాని మోదీ నిర్వహించే ఆన్‌లైన్ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌తో కలిసి మంత్రి సురేష్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో దొనకొండలో లోకో షెడ్ ఉన్నప్పుడు ఒక వెలుగు వెలిగిందని నేడు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధానమంత్రి మోదీ సహకారంతో దొనకొండను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారన్నారు. దొనకొండ రైల్వేస్టేషన్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేకూర్చేందుకు రూ.18.3 కోట్లు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ దొనకొండను అమృత భారత్ పథకంలో చేర్చటం చాలా సంతోషకరమన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రైల్వే ఏడీఆర్‌ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలతో కూడిన అర్జీలు అందజేత:

స్థానిక ప్రజా ప్రతినిధులు రైల్వే శాఖ ఉన్నతాధికారులకు, మంత్రి సురేష్, ఎమ్మెల్యే వేణుగోపాల్‌కు సమస్యలతో కూడిన అర్జీలు అందజేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లను రాత్రి వేళల్లో నిలుపుదల చేయాలని, రైళ్లను పొడిగించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ షెహబాజ్, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేసీరత్నకుమారి దేవానంద్, తహసీల్దార్ యం.సువర్ణ, ఎంపీడీఓ వసంతరావునాయక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి మృతి



దానియేలు మృతదేహం

మార్కాపురం రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన మార్కాపురం రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ వివరాల మేరకు..రాయవరం ఎస్సీ కాలనీకి చెందిన జి.దానియేలు(51) ఆదివారం ఉదయం ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవపడి బయటకు వచ్చాడు. 7.30 గంటల సమయంలో మార్కాపురం నుంచి గజ్జలకొండకు వెళ్లే మార్గంలో పట్టాలపై మృతిచెంది ఉండటాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదవశాత్తు పడ్డాడా, కావాలనే రైలుకింద పడ్డాడా అనేది పోలీసు దర్యాప్తులో వెల్లడి కానుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈయనకు భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు సత్తా

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పి.వి.ఆర్.స్పోర్ట్స్ ఎరీనాలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఎ.వెంకటసాయి హిమదీప్ సత్తా చాటి రన్నర్‌గా నిలిచాడు. ఆదివారం సాయంత్రం టోర్నమెంట్ ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించగా కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు.

కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతి



మృతిచెందిన ఉంగరాల శ్రీను

సంతమాగులూరు (అద్దంకి): ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు ఎన్నెస్పీ కాలువ వద్ద ఆదివారం జరిగింది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు అలియాస్ ఉంగరాల శ్రీను (70) సుబాబుల్ తోటలు కొని కర్ర వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం తమ బంధువుల గ్రామమైన సంతమాగులూరు మండలంలోని మక్కెనవారి పాలెం వెళ్లాడు. తిరిగి తన టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికొస్తూ మధ్యలో కొమ్మాలపాడు వద్ద కాలకృత్యం తీర్చుకోవడం కోసం కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తూ ముందుకు పడి మృతిచెందాడని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కోడలు తన్నీరు శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైద్య రంగంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త మార్పులు చోటుచేసుకుంటూ అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తోంది. అయినప్పటికీ ప్రాచీన వైద్య విధానమైన ఆయుర్వేదానికి నేటికీ ప్రాధాన్యత తగ్గలేదు. అలాంటి ఆయుర్వేద వైద్యానికి అవసరమైన ఔషధ మొక్కల సాగు దిశగా రైతన్నలు అడుగులు వేస్తున్నారు. గిద్దలూరు మండలం దిగువమెట్టతండాలో పాషాణభేది పంట సాగు చేస్తున్నారు. అడవికి దగ్గరగా ఉన్న పొలాల్లో తక్కువ నీటితో సాగవుతుండటంతో పాటు లాభాలు కూడా వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఆయుర్వేదానికి వ్యవసాయం

- ఆయుర్వేద పంటల సాగు దిశగా అడుగులు
- దిగువమెట్టతండాలో పాషాణభేది సాగు
- తక్కువ నీటితో సాగవుతున్న పంట
- లాభాలు వస్తుండటంతో రైతుల ఆసక్తి
- అడవికి దగ్గరి పొలాలు అనువు



పాషాణభేది మొక్క

గిద్దలూరు రూరల్: పాషాణభేది (కోలియస్) ఆయుర్వేద పంట సాగులో రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ లాభాలు గడిస్తున్నారు. గిద్దలూరు మండలంలోని దిగువమెట్టతండాకు చెందిన బాణావత్ సుబ్బానాయక్ అనే రైతు ఔషధ మొక్కల సాగు ద్వారా వినూత్న వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతు అయిన సుబ్బానాయక్ ఆరు ఎకరాల పొలంలో పాషాణభేది పంట సాగు చేస్తున్నాడు. ఈ పంట సాగుకు మొక్క కొనుగోలు కోసం రూ.6 వేలు, రెండు సార్లు సేద్యం, రెండుసార్లు కలుపు, పొటాషియం , 20–20 వంటి మందుల వాడకం, ఇతర ఖర్చులతో కలిపి ఎకరాకు సుమారు రూ.25 వేలు ఖర్చు చేస్తున్నారు. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న పొలాల్లో ఇటువంటి ఆయుర్వేద పంట సాగు వల్ల రైతులకు శ్రమ తగ్గి ఫలితం ఎక్కువగా ఉంటుందంటున్నారు. ఈ పంట సాగుకు ఎటువంటి రక్షణ కంచె అవసరం లేదు. పాషాణభేది మొక్కను ఎటువంటి జీవాలు తినవు. అందువలన పశువులు, పందుల బెడద లేదు. ఆరుతడి పంట కావడంతో నీరు తక్కువగా తీసుకుంటుంది. పంట కాల పరిమితి 5 నెలలు. జూలై నుంచి ఆగస్టు నెలల్లో ఎక్కువగా సాగు చేస్తారు. డిసెంబర్ నెలాఖరులో పంట సాగు పూర్తవుతుంది.

మొత్తం 11 ఎకరాల్లో పాశనబేధి సాగు...

ప్రస్తుతం దిగువమెట్టతండా, కె.బయనపల్లె గ్రామాల్లో మొత్తం 11 ఎకరాల్లో పాషాణభేది పంట సాగు చేస్తున్నారు. గతంలో ఉప్పలపాడు, కె.ఎస్.పల్లె, దిగువమెట్ట, బురుజుపల్లెతండా, వెంకటాపురంతండాల్లో సుమారు 100 ఎకరాలకుపైగా సాగు చేశారు. గతంలో పాషాణభేది పంట సాగు చేసే రైతులకు అనంతపురంకు చెందిన విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు ముందుగానే టన్నుకు రూ.10 వేల ప్రకారం అడ్వాన్స్‌గా చెల్లించి కొనుగోలు అగ్రిమెంట్ చేసుకుని రూ.15 వేల ప్రకారం కొనుగోలు చేశారు. పంట సాగు పూర్తయిన తర్వాత అనంతపురం సొసైటీ వారి ఆధ్వర్యంలోనే పంట కొనుగోలు జరిగేది. దిగువమెట్టతండాకు చెందిన సుబ్బానాయక్ పాషాణభేది, నన్నారి, చియా, అశ్వగంధ, సప్తతులసి, కస్తూరిబెండ, దూలగొండి, కలబంద వంటి ఔషధ మొక్కలను గత 12 సంవత్సరాల నుంచి సాగు చేస్తూ వినూత్న వ్యవసాయానికి శ్రీకారం చుట్టాడు. లాభాలు వస్తుండటంతో ప్రస్తుతం ఇతర రైతులు కూడా ఔషధ మొక్కల పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.



నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గరలో సాగుచేస్తున్న పాషాణభేది పంట



ఔషధ మొక్కల పంటలు సాగుచేస్తున్న సుబ్బానాయక్



పాషాణభేది వేరు

అమృతకు ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన రాంబాబు, జ్యోతి దంపతుల కుమార్తె అమృత తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయంపై గత నెల 24వ తేదీ సాక్షి దినపత్రికలో 'అమృత హస్తం కోసం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు స్పందించారు. అమృతకు వైద్యం కోసం ఆదివారం తల్లిదండ్రులను కలిసి రూ.43 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆరీఫ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న చిన్నారిని ఆదుకునే ఉద్దేశంతో ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అమృతకు వైద్యం కోసం సుమారు రూ.22 లక్షలు అవసరం అవుతాయని వైద్యులు చెప్పారని, మిగిలిన నగదును ఎవరైనా సాయం చేయాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యువ కేర్ సంస్థ సభ్యులు హరీష్, హబీబ్‌ఖాన్, షబ్బీర్, జనార్దన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



అమృత తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న యువ కేర్ సంస్థ నిర్వాహకులు

పట్టపగలే దోపిడీకి యత్నం

రాచర్ల: పట్టపగలే కొందరు వ్యక్తులు దోపిడీకి యత్నించిన సంఘటన రాచర్ల మండలంలోని అనుమలవీడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ షేక్షావలి గిద్దలూరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తుంటాడు. సొంతపనిపై హైదరాబాద్ వెళ్లాడు. అతని భార్య ఇంట్లో ఒంటరిగా మధ్యాహ్న సమయంలో భోజనం చేస్తుండగా ఏపీ39 ఎస్‌హెచ్ 0514 కారులో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నేరుగా ఇంట్లోకి వెళ్లి కత్తులు చూపించి బెదిరించారు. భయంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల నివాసాల ప్రజలు వచ్చారు. దీంతో దుండగులు అదే కారులో పరారయ్యారు. వారిని పట్టుకునేందుకు కొందరు స్థానికులు వెంటపడినప్పటికీ దొరకలేదు. కారు గౌతవరం గ్రామం వైపునకు వెళ్లిపోయింది. స్థానిక పోలీసులకు సమాచారం అందించగా హెడ్‌కానిస్టేబుల్ వెంకటరెడ్డి గౌతవరం గ్రామానికి వెళ్లి అక్కడి దేవాలయం ఎదురుగా ఉన్న సీసీ కెమేరాల ఫుటేజీ సేకరించి కారును గుర్తించి దర్యాప్తు చేపట్టారు.



సీసీ కెమేరా ఫుటేజీలో కారు

వాహనం ఢీకొని యాచకుడు మృతి

గుడ్లూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారిపై తెట్టు–మోచర్ల గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. తెట్టు పరిసర గ్రామాల్లో మతిస్థిమితం లేని యాచకుడు ఆదివారం తెల్లవారుజామున మోచర్ల వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నుంచి జాతీయ రహదారి దాడుతుండగా ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో..విద్యుదాఘాతానికి ముగ్గురు బలి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతానికి ముగ్గురు బలయ్యారు. మిద్దెపై ఆడుకుంటూ ఒకరు, వాటర్ హీటర్ తగిలి మరొకరు, ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజు పెడుతూ ఇంకొకరు మృతి చెందారు.

కనిగిరి రూరల్: విద్యుదాఘాతానికి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణంలోని కొత్తూరులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇందిరా కాలనీకి చెందిన వలంటీర్ తవ్వా రాజేంద్రారెడ్డి కుమారుడు తవ్వా సాయి(13) 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో కొత్తూరులో పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ మిద్దెపైన ఆడుకుంటూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే స్థానిక వైద్య శాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వెంకటసాయి భౌతికకాయన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డిలు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ నాయబ్ రసూల్, మాజీ వార్డు సభ్యుడు షరీఫ్, పెద్ద రసూల్, కంటు గురవయ్య, మూలే గోపాల్‌రెడ్డి, మారం రెడ్డి రవీంద్రారెడ్డి, ప్రకాష్ రెడ్డి ఉన్నారు.



వెంకట సాయి మృతదేహం



సుశీలమ్మ మృతదేహం

పీసీపల్లి: విద్యుదాఘాతానికి వ్యక్తి చెందిన ఘటన మండలంలోని కోదండరాంపురంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన పోనుగంటి రాఘవులు మరో ముగ్గురితో కలిసి గత మూడేళ్లగా కోదండరాంపురంలో 25 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని దానిమ్మ సాగు చేస్తున్నారు. కాగా పొలంలో ఉండే ట్రాన్స్‌ఫార్మర్ హెడ్డ్ ఫ్యూజు పోవడంతో దాన్ని వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై రాఘవులు(55) అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలోని వారు గమనించి విషయాన్ని గ్రామంలో తెలపడంతో వారు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వగ్రామం ఎడ్లూరుపాడు తీసుకుపోయారు. కాగా విద్యుత్‌శాఖాధికారులకు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా రాలేదని అందుకే మా తండ్రి తానే స్వయంగా ఫ్యూజువేసేందుకు ఎక్కి ఇలా మృత్యువాత పడ్డాడని మృతుని కుమారులు వాపోయారు.

విద్యుదాఘాతానికి వృద్ధురాలి మృతి

పొదిలిరూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కుంచేపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆరికట్ల సుశీలమ్మ (62) కరెంట్ హీటర్‌తో నీళ్లు కాచుకునే క్రమంలో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

పంచాయతీ ఉప ఎన్నికలకు నోటిఫికేషన్

- కొండపి నియోజకవర్గంలో ఒక సర్పంచ్, 14 వార్డు మెంబర్ పదవులకు ఎన్నికలు
- ఈ నెల 8 నుంచి నామినేషన్లు
- 19న పోలింగ్, కౌంటింగ్
- వివరాలు వెల్లడించిన ఎంపీడీవో జమీఉల్లా

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలోని మండలాల్లో గల పంచాయతీలకు సంబంధించి ఉప ఎన్నికలకు ఆదివారం నోటిఫికేషన్ విడుదలైనట్లు సింగరాయకొండ ఎంపీడీవో షేక్ జమీఉల్లా తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. ప్రజాప్రతినిధులు చనిపోయి ఖాళీగా ఉన్న ఒక సర్పంచ్, 14 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పాకల పంచాయతీలో సర్పంచ్ ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికకు సంబంధించి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 11వ తేదీ స్క్రూటినీ, 14న నామినేషన్ల విత్‌డ్రా, 19న ఓటింగ్, అదేరోజు మధ్యాహ్నం నుంచి కౌంటింగ్ జరుగుతుంది.

వార్డు మెంబర్లకు సంబంధించి మండలాల వారీగా పొన్నలూరు మండలంలోని ముప్పాళ్ల 8వ వార్డు, ఇప్పగుంట 3వ వార్డు, మర్రిపూడి మండలంలో కాకర్ల 7వ వార్డు, కూచిపూడి 4వ వార్డు, కొండపి మండలంలో పెద్ద కళ్లగుంట 10వ వార్డు, కె.ఉప్పలపాడు 10వ వార్డు, చిన్న కండ్లగుంట 4వ వార్డు, సింగరాయకొండలో 16వ వార్డు, మూలగుంటపాడులో 10వ వార్డు, టంగుటూరు మండలంలో పొందూరు 1వ వార్డు, కందులూరు 2వ వార్డు, వాసేపల్లిపాడు 2వ వార్డు, జరుగుమల్లి మండలం పైడిపాడు 8వ వార్డు, రామచంద్రాపురం 4వ వార్డుకు పాకల పంచాయతీ సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీవో వివరించారు.

డీజీ ప్రతాప్‌రెడ్డిని సన్మానించిన చింతలచెర్వు

హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం గ్రామానికి చెందిన ఐపీఎస్ ఆఫీసర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. కనిగిరి ప్రాంత పర్యటనకు వచ్చిన ఆయన్ను చింతలచెరువు కలిసి మాట్లాడారు. కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు నియోజకవర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం హనుమంతాపురం ఎంపీటీసీ తానిగుండాల తిరుపతరెడ్డి, నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి ఐజీని కలిసి సన్మానించారు. అనంతరం నందనవనం ఎంపీటీపీ ఆహ్వానం మేరకు నందనవనంలో సాగులో ఉన్న అరటి, తమలపాకుల సాగును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈయన వెంట ఎంపీటీసీలు తానిగుండాల తిరుపతరెడ్డి, నారాయణస్వామి, సీతారాంపురం సర్పంచ్ భర్త మారంరెడ్డి రవేంద్రరెడ్డి, చిన్న ఇర్లపాడు సర్పంచ్ ముద్దబాబు, టి. వెంకటరామిరెడ్డి, మూలే గోపాలురెడ్డి, వద్దెంపుడి శివారెడ్డి, కె.రమణారెడ్డి. డి వెంకటస్వామిరెడ్డి ఉన్నారు.



ఐపీఎస్ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న చింతలచెరు సత్యనారాయయరెడ్డి

శభాష్ రోజా

- జిల్లా విద్యార్థినికి బంగారు పతకం

సాక్షి, చెన్నై: మద్రాసు వర్సిటీ నుంచి ఎంఏ తెలుగులో ప్రతిభ చాటిన ప్రకాశం జిల్లా పామూరు మండలం గుమ్మలంపాడు అనే మారుమూల గ్రామానికి చెందిన గంధం రోజా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. రోజా పదో తరగతి వరకు స్థానికంగా చదివారు. ఆ తర్వాత కుటుంబ సమస్యల కారణంగా ఆమె కళాశాల జీవితం ఒడిదుడుకులతో సాగింది. కొన్ని సబ్జెక్టుల్లో తప్పడంతో రెండేళ్లు చదువుకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత మద్రాసు క్రైస్తవ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు యజ్ఞశేఖర్ సాయంతో చదువు కొనసాగించారు. చెన్నైలో రాణిమేరీ కళాశాలలో బి.ఎ తెలుగులో చేరి గతంలో సీఎం స్టాలిన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ప్రస్తుతం మద్రాసు యూనివర్సిటీలో ఎం.ఏ. తెలుగులో బంగారు పతకం సాధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ తన తల్లి జన్మనిస్తే చదువు పరంగా పునర్జన్మను ఆచార్యులు డాక్టర్ యజ్ఞశేఖర్ ప్రసాదించారని పేర్కొన్నారు. తన చదువు విషయంలో మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షుడు విస్తాలి శంకరరావు, రాణి మేరి కళాశాల డాక్టర్ నళిని కృషికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. తన గ్రామంలో ఎం.ఏ వరకు చదివిన మొదటి యువతిని తానేనని, పీహెచ్‌డీ చేయాలన్నది తన ఆశయమని తెలిపారు. మారుతున్న సమాజంలో మగవారితో పోటీపడి అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ తమ గ్రామంతో పాటు పలు మారుమూల గ్రామాల్లో ఆడపిల్లలను చదువులో ప్రోత్సహించకుండా చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారని, ఈ ధోరణి మారాలని ఆమె ఆకాంక్షించారు.



రోజాకు బంగారు పతకం అందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వెల్లువెత్తిన నిరసన

- మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా క్రైస్తవుల ర్యాలీ, మానవహారం

ఒంగోలు: మణిపూర్ ఘటనకు నిరసనగా పలువురు క్రైస్తవులు ఆదివారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెయింట్ థెరిస్సా ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న మారణకాండను నిరసిస్తున్నామంటూ నినాదాలు చేశారు. ఆర్‌సీఎం చర్చి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ.. ప్రకాశం భవనం వరకు సాగింది. అనంతరం చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం చర్చి ఫాదర్ డీఎస్ పాల్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దాడులు బాధాకరమన్నారు. చర్చిలను కూల్చివేయడం, అమాయకులను చంపేయడం వంటివి జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం సరికాదంటూ విచారం వ్యక్తం చేశారు. తక్షణమే అక్కడ శాంతి భద్రతలు నెలకొల్పాలని, ఈ దాడులకు కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ డీఎస్ పాల్, జి.అల్ఫోన్జ్, సంఘ పెద్దలు, ఆర్‌సీఎం యూత్ సంఘస్తులు, ప్రజలు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న క్రైస్తవులు

విధ్వంసాలకు చంద్రబాబే బాధ్యుడు

చీరాల: తన రాజకీయ మనుగడ కోసం ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబునాయుడు విధ్వంసాలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో పుంగనూరులో జరిగిన చంద్రబాబు యాత్రలో కావాలనే శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని నిరసిస్తూ ఆదివారం చీరాల పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లో పోతుల సునీత ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేక చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరుతో తన పార్టీ రౌడీమూకలతో విధ్వంసాలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న మంచిపేరు చెడగొట్టాలనే తలంపుతో చంద్రబాబు దాడులను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. కుట్రలు, కుతంత్రాల్లో పీహెచ్‌డీ చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తీసుకురావాలనే లక్ష్యంతో ప్రాజెక్టుల సందర్శన, యాత్రలు, బహిరంగ సభలు నిర్వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పుంగనూరు ఘటనలో యాభై మంది పోలీసులు, ప్రజలకు తీవ్ర గాయాలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికలే ఆఖరివని జోస్యం చెప్పారు. తీరు మార్చుకోకపోతే ప్రజలే ఆయనకు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లెల బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.